అయినసంబంధాలు

[కథానిక]

◉

శ్రీ రా. సి. ఆంజనేయశాస్త్రి

"అద్దిగదీ! ఆ మాటంటేనే అరికాలిమంట నెత్తికెక్కొస్తుంది" అనే గర్జనవల్ల నుంచునే కునికిపాట్లు పడుతున్న నేను ఉలిక్కిపడి కళ్లు తెరిచాను. గూడూరు దాటిందల్లే వుంది మెయిలు. చీకట్లను కావిలించుకొస్తున్న చలిగాలి రైలుపెట్టెకిటికీ దగ్గిరే నాచూపుల్ని అరికట్టింది. దానికి తల ఒగ్గి రెప్ప వాల్చి, ఒకక్షణం ఆగి మళ్లీ చూసేసరికి, దూరాన గుట్టల మీద తమస్సుని తలపాగాచుట్టుకు కూర్చున్న అడవి చెట్లతో సరసాలాడుతున్న మిణుగురులూ, "మేమూ వాటితోబాటు సరసాలాడుతాం" అంటూ తగుదుమమ్మా అని యింజనుగొట్టంలోంచి బయలుదేరి దారిలోనే ఆరిపోతున్న రవ్వలూ కనిపించాయి. ఒంటికాలిమీద నుంచుని తపస్సుచేసే యోగిలాగా యిందాకటినుంచీ కుడికాలుమాత్రమే కింద ఆన్చగలిగా. పక్కవాళ్లని బతిమాలి కాలు మార్చుకుని, గాలి చెవుల్లోకి పోకుండా ఉత్తరీయం చెవులమీది కొచ్చేట్టు చుట్టకుంటుంటే, కొంచెం మోటగానే, నా ఎడంచెయ్యి పట్టుకుని లాగుతూ "మీరు చెప్పండి స్వామీ, పెద్దమనుష్యులు... నే నియ్యనంటే పిల్లని, చెప్పతీసుకు కొట్టండి. ఒప్పుకుంటా..." అన్నాడా మీసాల ఆసామి. యాభైకుయిదు ఏళ్లున్నా మాంచి బలంగా కనిపిస్తున్నాడు. కొంచెంబొద్దు. గుబురుమీసంలో వెండితీగల్లాంటి తెల్లవెంట్రుకలు వింత సోయగాన్ని చేకూరుస్తున్నాయి. అవతలాయన వయస్సు కొంచెం తరుగే కాని, మనిషి పీలగా వుండటంచేతా, నుదురు ముడతలు పడటంచేతా ముదురుగానే కనిపిస్తాడు.

"కట్టె విరిచినట్లు చెప్పాలా ఏమిటి నా పిల్లనియ్యననీ?... క్రియ కాస్తా చేసి గప్‌చిప్‌గా కూర్చున్నావు... ఏమంటారు బాబూ?... అప్పపెనిమిటిగదా ఒచ్చింది... అదేనా ఆయనకి చెప్పాల్సినమాట?..." అంటూ ఆ పీలమనిషికూడా నాతీర్పును కోరుతూ, నామొహంలోకి చూశాడు. అసలు వాళ్ల తగాదాలూ, జరిగిన మాటామంతీ సమస్తమూ నాకు తెలుసుననే ధోరణిలో వాళ్లు మాట్లాడుతుంటే, నేను కాస్త ఉక్కిరిబిక్కిరై "మాది యీవేపు కాదు. ఉత్తరాది. మీ రెవరో తెలీదే నాకు! అసలు సంగతేమిటి?" అన్నా, కునికిపాట్లకిక అవకాశం ఉండదని గ్రహించి.

"ఉత్తరాదయితేనేం? దక్షిణాదయితే నేమండి?... నూటిగా పోయి, నూటిగా ఒచ్చేవాడికి ఎక్కడైనా, రెండూరెండూ నాలుగే!..." అన్నాడు మీసాలాసామీ... నేనునూటిగాపోయి నూటిగారానివాడినని ఆయనఉద్దేశం? పెదిమె కదపబోయేసరికి మళ్లా పీలమనిషి అందుకున్నాడు- "మాకుమటుకు మీ రెవరో తెలుసా ఏమిటి?... మీరు పెద్దమనుష్యులుకదా అని చెబుతున్నా..." నంటూ. అవును. దాంట్లో సందేహమేముంది? హైస్కూలు టీచరునేగా నేను?... పీలమనిషే యింకా సాగిస్తున్నాడు: "మా పెద్దన్నయ్య లేడుటండీ!... అదేలే!... సవతితల్లిబిడ్డన్న మాట!... మానాన్న రెండోపెళ్లి చేసుకున్నాడుగదూ మరి? అదీ లెక్క... ఆ అన్నయ్యకి ఇదిగో యీయనగారి అప్పనిచ్చారు" అంటూ "ఈపాటిసంగతికూడా మీకు తెలీదూ?" అనే అర్థం ఒచ్చేట్టు నాకేసి చూశాడు.

"కాదన్నానా నేనుమటుకు?" అన్నాడు బిగ్గరగా మీసాలాసామీ చుట్ట ముట్టిస్తూ. వినకతప్పేట్టు కనిపించలేదు నాకు. మళ్లీ కాలు మార్చుకుందామని ప్రయత్నిస్తుంటే పీలమనిషి మరికాస్త

ఒత్తిగిలి నా రెండుకాళ్లూ కింద ఆనేటటు సౌకర్యం కలగజేశాడు. నేను తాపీగా నుంచుని "అయితే తగాదా ఏమిటీ ?" అన్నాను.

"అబ్బే ! తగాదా ఏముందండీ ? వడ్లగింజలో బియ్యపుగింజ... నేనూ, మాఅప్పామూ టలా వుంచండి... అది పరాయిఅమ్మ కన్నబిడ్డేగదా, వెళ్లి దాన్నడగండి... మేనరికం యిద్దా మనకున్నామో లేదో !...లేదన మనండి...మీసం గొరిగించి..." అని మీసాలాసామి ఏదో అనబోతుంటే, అర్థోక్తిలోనే పీలమనిషి "ఆ... యివాళ గొరిగిస్తే, రేపిపాటికి మొలుచుకొస్తుంది—" అనేశాడు తేలిగ్గా. మీసాలాయనకి చర్రుమంది. "అబద్ధాలూ, సుబద్ధాలూ ఆడి, నేను ఊళ్లో నలుగురిదీ పోగేసుకోలేదు." అన్నాడు. పీలమనిషికి అదెక్కడ పొడుచుకుందో ఏమో "ఆఁ...ఎందరిది పోగేసుకోక పోతే, నీకు, పదెకరాల కొంప్రదెక్క డొచ్చి పడిం దేమిటి ?" అన్నాడు.

"అలా పోగేసుకున్నావుకనకనే, ఎక్కడివక్కడ ఊడ్చిపెట్టుకుపోయింది" అని దులిపాడు మీసాలాసామి.

"ఆఁ...యిల్లలకగానే పండగైందిలేస్తూ?...నీది మాత్రం నిలిచేడిసేదా? ఆగూ, నాలుగుకాలాలపాటు!" అని అక్కసు తీర్చుకున్నాడు పీలమనిషి...

"తనకి లేదని ఏడిచినందుకు ఒక కన్ను పోయిం దట. ఎదటివాడి కున్నదని ఏడ్చినందుకు యింకోకన్ను పోయిందట—" అంటూ అలంకారాల్లోకి దిగాడు మీసాలాసామి...నా కంచుకోకతప్పలేదు.

"అది కాదయ్యా, అసలుతగాదా విడిచిపెట్టి దీంట్లోకి దిగారేమిటీ ?" అని నేననేసరికి "అలా గడ్డిపెట్టండి వాడికి" అని యిద్దరూ ఒకేసారి అన్నారు. నేను నవ్వటం కనిపెట్టి, పీలమనిషే గుక్కతిప్పుకుని "మాట తీయగా మాట ఒస్తుంది బాబూ...మాఅన్నయ్య సంసారం యిప్పుడు కొంచెం చీలికే వుందనుకోండి.... అయితేమటుకు..."అని ఏదో చెప్పబోతుంటే...

"ఆఁ...ఒకప్పుడుమటుకు యింత వేసీవెయ్యన ట్టుం దేమిటి యిప్పుడు చితకటానికి ?" అని మీసాలాసామి సమిధవేశాడు.

"నువ్వూరుకో బావా కాస్సేపు...నేను చెప్పే దాకా !...మీనాన్న కాళ్లా వేళ్లా పడితేనే ఒప్పుకున్నాం తెలుసా?..."అంటూ నావేపు తిరిగి "అదండీ విషయం...మాఅన్నయ్యకొడుక్కి పెళ్లీడొచ్చింది... ఇదిగో యీయనగారి దగ్గిర యీడైన పిల్ల లున్నారు." అన్నాడు పీలమనిషి...

"కాదన్నానా నేనుమటుకు ?" అని పొగాకు గుక్కపీల్చాడు మీసాలాసామి.

పీలమనిషి సాగించాడు కథ: "ఆపైనేమైందీ...?, నేనూ, మాఅన్నయ్యా స్వయంగా వెళ్లి 'బావా, బావా, మీ అమ్మాయిని మన అబ్బాయి కియ్య' అని అడిగాం...నోరు చేసుకుని... త ప్పేమన్నా వుందా బాబూ?..."అని ఆగాడు.

"అబ్బే ! ఎవరంటారయ్యా ?..."అన్నా నేను.

"కాదన్నానా నేనుమటుకు ?" అని మామూలు పదం వేస్తూనేవున్నాడు మీసాలాసామి...

"మావాడికేం పిల్ల దొరక్కకాదు...వాళ్లింటి కెళ్లింది...ఏదో అయినసంబంధం. మేనరికం ప్రధాన మంటారూ...ఒక పేగులోంచి ఒచ్చారూ అనే అను బంధంవల్ల కాదూ 'దేహి !' అని అడగటం?...అసలు ఆడపిల్లకలవాడు కాదటండీ...'ఇదిగో నబ్బాయి... నా పిల్లని నువ్వు చేసుకోవాలి' అని అడగాల్సింది?..."అని నాఅభిప్రాయంకోసం ఒక్క క్షణం ఆగాడు పీలమనిషి...

"ఏమో ! నేనే అడిగేవాడినేమో ! ఓపికపట్ట లేకపోయారూ?..." అంటూ మీసాలాసామి సమాధానంగా ప్రశ్నించాడు. నా అభిప్రాయం ప్రకటించాల్సిన అవసరం కలగలేదు.

"ఎందుకు లేవయ్యా కబుర్లూ?...లచ్చుకూ, రుక్కుకూ పరాయిసంబంధాలు చెయ్యలేదూ నువ్వు ?...వాళ్లుమటుకు యీడుకాదూ పెద్దబ్బాయికి? మళ్లీ నరుసుకి కూడా అక్కడా అక్కడా విచారిస్తున్నట్లు తెలుస్తోందయ్యో..." అన్నాడు పీలమనిషి.

ఇంత సూటిగా దెబ్బతగుల్తుందని మీసాలాసామి అనుకోలేదు. కాస్త నీళ్లు నమిలి "ఆ...మాఘుబహుళంలో లచ్చుపెళ్లయిందో లేదో...ఫాల్గుణశుద్ధంలో

మీరు భూషాయిపెళ్లి చేసేశారయ్యా...ముందే విచారించి వుంచుకోక పోతే ఇట్టే చెయ్యగలిగేవారా?" అన్నాడు.

"ఆఁ!...చెయ్యక, బ్రహ్మచారిగా వుంచుతారనుకున్నావేం?...ఆడపిల్లలు దొరక్కపోరు...ఏదో శాస్త్రం చెప్పినట్లు, ఏ బొంత కాగంత ..." అని అంటూ దెబ్బతీశాడు పీలమనిషి...చప్పున మీసాలాసామి అందుకుని "మరే! మొగపిల్లలే కరువయ్యారు..." అన్నాడు ఎకసక్కెంగా...

"ఎవరి కెవరూ కరువుకాలేదు...కాకపోతే, మేనరికాలూ, అయినసంబంధాలూ కంటికానటం లేదు. ఇంతకీ, బాబూ, వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి...రోజు లెలా వున్నాయి?...'కాసులు గలవాడే రాజు'అని...కులం గోత్రం, తనా మనా ఎవరిక్కావాలి బాబూ? ఏదో నాలుగురాళ్లు కనిపిస్తున్నాయి ఆయనకని....మొదట్లోనే మనవిచేశాగా, మా పెద్దన్నయ్యసంసారం కాస్త చితికిందని...ఈయనగారి కళ్ల కానలేదు. పరాయిసంబంధాలు చేశాడు...అంతే" అని తేల్చేశాడు పీలమనిషి.

"అద్దిగదీ! ఆమా టంటేనే అరికాలిమంట నెత్తికెక్కుస్తుంది. నేనేం యివ్వనన్నానా పిల్లని?" అని కళ్లెర్రజేశాడు మీసాలాసామి.

"అనా లేమిటయ్యా వేరే? క్రియకాస్తా చేసి కూర్చున్నావ్!" అన్నాడు పీలమనిషి...సన్నగా.

సగంకాలిన చుట్ట కిటికీలోంచి పారేసి,యిందాకటినుంచీ జాగ్రత్తగానే వింటూన్నా, యింకా జాగ్రత్తగా వినాల్సిందన్నట్టుగా, నా జబ్బ పట్టుకుని ఊపుతూ "బాబూ, అంతా బాగానే వుందిగని..., కట్నం ఎంత యిస్తావని నిక్కచ్చిచెయ్యడం ఎందుకండీ నన్ను—ఎవరో పరాయివాణ్ని అడిగినట్టు?" అని కోరగా చూశాడు మీసాలాయన, పీలమనిషి వంక...

ఆయన తల వంచుకునే... "ఆ ప్రసంగం తెచ్చింది నేను...మాఅన్నయ్య కట్నంమాట ఎత్తనే లేదు...ఏదో మాటవరసకి నేనే..." అని నీళ్లు నమిలాడు...

"నువ్వడిగితే ఒకటీ, మీఅన్నయ్య అడిగితే ఒకటీనా? రాయబారాని కొచ్చి నిజం చెప్పొద్దూ? కట్నంమా టడిగేసరికి నగలమాట నే నెత్తాను. 'అబ్బాయే నగ'లని వాళ్లంటే 'అమ్మాయే కట్న'మని నే నన్నాను. 'కట్నం నిక్కచ్చి చేస్తే అమ్మాయి మీకు దక్క' దని నాపక్కనే వున్న మాపింతల్లి కొడుకన్నాడు...'అయితే యిదంతా నా కెందు కొచ్చింది. మీ అక్కయ్యనే పంపుతా'నని మా బావ అన్నాడు. 'సరే'నని నేనన్నా...మళ్లీ అది ఒస్తే ఒట్టు"అని విజయగర్వంతో చూశాడు మీసాలాయన.

"ఆఁ...లేదనిపించుకుంటానికి రావడ మెందుకని ఆవిడగా రూరుకుంది". అన్నాడు పీలమనిషి.

"అదేంమాట? లేదనిపించుకునేదో, వుందనిపించుకునేదో?...నేనుమటుకు నాబిడ్డకి పెట్టుకోనుటండీ? నిక్కచ్చిచేస్తే నాకు పట్టింపు ఒచ్చింది కాని?...పోనీ, నేను పెట్టకపోతే, తల్లి వూరుకుంటుందా? అదీ వూరుకుంటేమటుకు, 'అప్పగార్లతో పాటు పెట్ట'మని తన్ని తీసుకోదూ చెల్లెలుమాత్రం?" అంటూ నోరు కట్టేశాడు మీసాలాసామి.

పీలమనిషి వినుగ్గా "ఎందుకొచ్చిన కబుర్లండీ! మేనల్లుడి కివ్వాలనే వుంటే, వెళ్ళి 'ఒసే, అక్కయ్యా... యిలా ముడెయ్యాలనుందే' అంటే, మావదినెగా రొద్దంటుందండీ?..." అన్నాడు.

"నేనొచ్చి అడగాలేం? అదే ఎందుకు రారాదు!" అని ప్రశ్నించాడు మీసాలాసామి.

"ఆవిడమాత్రం నువ్వు పుట్టినట్లు పుట్టలా? నీకెంత పెంకో ఆవిడకీ అంతే!"...అని సమాధానం చేశాడు పీలమనిపి యిద్దర్నీని.

"ఆఁ...మంచిమా టన్నావు...ఆడకూతురికే అంత యిదయితే, మొగముండాకొడుకుని నా కెంత నిక్కండచ్చు బాబూ,...న్యాయం చెప్పండి..."అని మీసం మీద చెయ్యేశాడు మీసాలాసామి.

"అవునవును...అలాగే వుంది కాలం..."అన్నానేను.

"ఇంతకీ రాసిపెట్టలేదు..."అన్నారు యిద్దరూ ఒక్కమాటుగానే. ఈవిషయంలో యిద్దరూ ఏకీభవించారు.

"ఎవరి కెక్కడ నీళ్లు ప్రాప్తో!" అంటూ, ఎదట బల్లమీద కూర్చున్న ఒక ప్రౌఢ పమిట సద్దుకుంది.

"ఏమో లెండి...జానకికి కలవరాదూ,.. గీత వుంటే?..."అన్నాడు మీసాలాసామీ...

"అయితే యీాడైన మేనల్లు డున్నాడన్న మాట !..."అన్నా నేను...

"ఆఁ...గోపీకేగా ? గోచిపెట్టుకోటంకూడా తెలీని సన్నాసి...పదకొండేళ్లుంటాయి..."అని నసిగాడు పీలమనిషి...

"జానకికి మటుకు మొన్న దీపావళిఅమావాస్యకేగా నాలుగోఏడు వెళ్లిఁది?..."అని మీసాలాసామి అన్నాడు. ఇంతలోనే యింత మార్పు రావటం నా కాశ్చర్యంవేసింది.

"అయితే, యిందాకటినుంచీ చెప్పిం దెప్పటిమాటేమిటి ?..."అన్నా...

బిగ్గరగా నవ్వుతూ మీసాలాసామి"అబ్బే ! యిప్పటిసంగ తటండీ;...ఎనిమిదేళ్లళ్ళ తొమ్మిదో ఏడుజొరబడింది. లచ్చూ, రుక్కూ, నరుసూ, సుబ్బూ అయింతర్వాత జానకి కడసారి పిల్ల. నలుగురూ కాపరాలు చేస్తున్నారు. పెద్దమ్మాయికి నలుగురుపిల్లలూ,... రెండోదానికి ముగ్గురూ, మూడో అమ్మాయికి ఒకత్తె... యిప్పుడు...నిరుడే పోయాడు ఓకొడుకు పుట్టి... పండల్లే వుండేవాడు...సుబ్బు యీ ఏడే కాపరాని కెళ్లింది..." అంటూ మనమల సంగతంతా ఏకరువు పెట్టాడు.

పీలమనిషి తన అన్నగారి నలుగురు కొడుకులికీ ఎక్కడెక్కడ సంబంధా లొచ్చాయో, వాళ్ళ కెంద రెందరు పుట్టారో, చచ్చిపోయిం దెవరో, బతికున్నవాళ్లెందరో తేదీలవారీగా చెప్పాడు.

"నీ కెంతమంది పిల్లలు?" అన్నా నేను. పాపం! పీలమనిషి గద్గదస్వరంతో "ఏం లాభం బాబూ! యిప్పుడొక్కడూ లేడు...ఆ గోపినే దగ్గరికి తీసుకున్నా" నన్నాడు. నాకూ కష్టంవేసింది...

"నీకూ అయిన సంబంధమేనా ?..." అన్నా మాట తప్పించటానికి.

"మాపెత్తల్లి కూతుర్నే గదండీ...యీాయన కిచ్చింది !" అన్నాడు మీసాలాయన రెండో చుట్ట తయారుచేస్తూను.

"ఏమయితే నేం స్వామీ? ఈ ఎనిమిదేళ్లనుంచీ యీ ఇంటి కాకి ఆయింటిమీద వాలలేదు" అని బిక్కమొహంవేశాడు పీలమనిషి.

"చచ్చి, కలుపుతున్నాడు..." అని బావురుమన్నాడు మీసాలాసామీ... ఇంతవరకూ అంత కచ్చగానూ, ఆవేశంతోనూ మాట్లాడిన అంతమనిషీ యింతలో అంత దుఃఖించడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

"పాపం...మీబావమరిది పోయాడేం ? ఒక రోజు ముందో వెనకో, ఎవరికీ తప్పదులెండి" అన్నా ఓదార్చటానికి...

"మరే!...పెద్దదినాని కెడుతున్నాం బాబూ... యీాయనా దార్లో ఒంగోలులో కలిశాడు...మా అప్ప మొహం ఎలా చూడనా అని ఏడుస్తున్నా...సీతాంబ వారల్లే యింత కుంకంబొట్టు పెట్టుకుని...ఎంత ప్రేమను కున్నారు దానికి నేనంటే !...మా బావమటుకు? ఒళ్లు కోసిచ్చేవాడు కాదండీ నాకు ?...ఇంతకూ..." అని మళ్లీబావురుమన్నాడు. వాళ్ళ ప్రకృతులు నా కేమీ అర్థంకాలేదు. చదువుకున్న మనుష్యుల్లో యింత సరళత వుంటుందా అని సందేహిస్తూ కిటికీలోంచి చూసేసరికి నెల్లూరొచ్చింది. గబగబా రైలు దిగి "జానకిని మటుకు గోష్పీ కిచ్చి చెయ్యం"డన్నా. "చిత్తం... చిత్తం" అన్నారు యిద్దరూను కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

దీపాల కాంతిని తోసుకుని చీకట్లోకి చేరింతర్వాత, కన్నీటి చారికలు గల మీసాలాసామి మొహం ఎదురుగా ఒచ్చి, "ప్రేమలోగాని, కోపంలోగాని నీ కెప్పుడన్నా యింత తీవ్రానుభూతి కలిగిందీ?" అని ప్రశ్నించింది. ఓటమిని అంగీకరించిన నా హృదయాన్ని ఎడంచేత్తో గట్టిగా పట్టుకుని రిక్షా ఎక్కా.

నే నెరిగిన గాంధీమహాత్ముడు*

= శ్రీ కొండ వెంకటప్పయ్య =

మహాత్ముడు మహాత్మా బిరుదమును పొందక పూర్వమే నేను వారిని దర్శించుటయు, వారు మహాభారములగు కార్యక్రమములను చేపట్టిన పిమ్మట కొన్ని సమయములందు సన్నిహితుడుగ ప్రవర్తించు భాగ్యమును నా కబ్బినందుకు నే నెంతయు గర్వించుచున్నాను. ఒకప్పుడు వారు కాంగ్రెసు మహాసభా సమావేశమందు దక్షిణాఫ్రికాలోని భారతీయులు పడుచున్న కడగండ్లనుగూర్చి నివేదికను చదివి వినిపించుచుండగా వారిని నేను దర్శించితిని. వారి స్వరూపమును చూచుట కదియే ప్రథమము. ఆనాడు వారు ఆంగ్లేయులవలెనే దుస్తులను ధరించియుండిరి. కాని వర్ణింపరాని కష్టములకును, అవమానములకును పాత్రులై నిస్సహాయులైన జనుల నుద్ధరించవలె నను దీక్షాపరత్వము అప్పటికే వారి ముఖవిలాసమందు విస్పష్టముగ గాన్పించుచుండెను.

అహింసామార్గము నవలంబించి, సత్యాగ్రహమును బూని దక్షిణాఫ్రికాలో బోయరుల ప్రభుత్వముతో పోరుసల్పి, అచ్చటి భారతీయుల బాధలను తొలగించుటకు తగిన ఏర్పాటులను గావించి, మాతృభూమియగు భారతదేశమునకు చనుదెంచి, ఇచ్చటి పరిస్థితులను పరిశోధించుటకు దేశమునందు సంచారము సల్పుచుండెను. ౧౯౧౫ సం. నెల్లూరునందు సమావేశమైన మద్రాసురాష్ట్ర కాంగ్రెసు మహాసభ నిమిత్తము వారు విచ్చేసినప్పుడు కొందరు మిత్రులతో కూడ వారి దర్శనార్థము వారి బసకు పోయియుంటిమి. అప్పటికి వారి స్వరూపమున గొప్పమార్పులు పొడసూపినవి. అతిపేదయగు నొక సాధారణ మానవునివలె నొక చిన్నగుడ్డను మొలచుట్టు చుట్టుకొని సన్నదియగు నొక చిన్న చేతికఱ్ఱను చేతబట్టుకొని, ఉదయమున వ్యాయామము నిమిత్తము పురమువెలుపల పరిభ్రమణ గావించి వారు మరలివచ్చునప్పటికి మేమును వారి బసకు చేరితిమి. మేమందరము కూర్చొనుటకు బల్లలుగాని, కుర్చీలుగాని, చాపలుగాని లేకపోవుటచేత, తల్లియగు భూదేవి ఆసనములు కల్పించినదని నుడువుచు, తాను నేలమీద కూర్చొని మమ్ముల నందరిని గూర్చొనుడని వాక్రుచ్చెను. ఇట్లు వారియందు మూర్తీభవించిన నిరాడంబరత్వము మా కొక క్రొత్త యనుభవమును చేకూర్చెను. అంతట, అప్పుడప్పుడే సాగించబడుచున్న ఆంధ్రరాష్ట్ర నిర్మాణోద్యమమునుగూర్చి నేను వారితో ముచ్చటించితిని. వారు మద్రాసులో నెవరో చెప్పిన మాటలనుబట్టి కాబోలును "మీ ఆందోళన అరవలయెడ మీకు గల ద్వేషమునుబట్టి సాగించుచున్నట్లు వినుచున్నా"నని పలికిరి. అది సరి గాదనియు, ఆంధ్రులకు ప్రత్యేకభాషయు, ప్రత్యేకసారస్వతసాహిత్యములును, ప్రత్యేకమును ప్రగల్భమును నగు చారిత్రమును కలవనియు, ప్రత్యేక ఆశయములు, ఆచారములు కలవనియు, కాని మాకు పలుకుబడి లేక మేము ఆంధ్రుల మను విషయమే ఇతరులకు తెలియక, దుస్థితిలో నున్న కారణమున ఆత్మోద్ధరణకై ఆంధ్రరాష్ట్రమును గోరుచున్నాముగాని, మరెవ్వరిమీదను ద్వేషభావముతో కాదని వారితో గట్టిగ మనవి చేసితిని.

మాంటేగూచలమ్స్‌ఫర్డుల పేర పేర్కొనబడు రాజకీయ సంస్కరణలనుగూర్చి ఢిల్లీలో మాంటేగూచలమ్స్‌ఫర్డులకు ఒక నివేదిక నందజేయుటకు నేర్పడిన అఖిలభారత ప్రతినిధివర్గములో నే నొక ప్రతినిధిగ నియమింపబడుటచేత అచ్చటికి వెళ్లియుంటిని. ఆ ప్రతి

---

* ఆలిండియా రేడియో-మద్రాసు కేంద్రము వారి అనుమతితో.